# కళాకారులిద్దరూ!

కె. యస్. ప్రసాద్



శ్రీ భవనం పై అంతస్తులో వున్న 'డయిమండ్' ఆర్ట్ థియేటర్లో 'సత్యజిత్‌రాయ్' తీసిన 'నాయక్' బెంగాలీ సినిమాని చూసి బయటపడ్డాను. సాయంత్రం ఆరు కావటం మూలంగా మౌంటు రోడ్డులో వాహనాల రద్దీ ఎక్కువగా వుంది. నా ఆలోచనలనిండా 'నాయక్' సినిమాయే నిండి పోయింది.

బెంగాలీ సినిమాల్లో బాగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న ఒక మహానటుడు నాయకుడు. తన నటనా ప్రాభవానికి ప్రభుత్వం మెచ్చి యివ్వబోతున్న బహుమతిని అందుకోవటానికి కలకత్తా నుండి ఢిల్లీ ప్రయాణమౌతాడు. ఆ ప్రయాణంలో జరిగిన వివిధ సంఘటనలు, ఆ నాయకుడి మానసిక చిత్రణ — ఈ 'నాయక్' సినిమా. తెలుగువాణ్ణయిన నేను ఆ వంగభాషా చిత్రాన్ని చూడటానికి కారణం, ఆ సినిమాకి దర్శకత్వ వహించిన 'సత్యజిత్‌రాయ్.'

సత్యజిత్‌రాయ్ తత్వం ఒకంతట అర్థం కావటంలేదు నాకు. తను స్వతహాగా ఒక 'మార్క్సిస్ట్' కళాకారుడయి వుండికూడా ఒక బూర్జువా జీవితాన్ని చిత్రించటానికి కారణం ఏమిటో!? 'ఒక కళాకారుడు బూర్జువాగా మారితే, అతని జీవితంలో ఆ 'కళ' ప్రథమ స్థానాన్ని కోల్పోతుంది' అని నిరూపించటానికా!?, లేక, ఒక నటుడి నిజజీవితంమీద అతని నటన ప్రభావం ఎంతవరకూ వుందనా!? ఒక కళాకారుణ్ణి ప్రజలు, చుట్టూవున్న భజనపరులు అదేపనిగా పొగుడుతూ వుంటే అతనొక'నార్సిసిస్ట్'గా మారిపోయే ప్రమాదం తప్పనిసరి సుమా అని హెచ్చరించాడా? అలా అయితే రైల్లో, తనొక పత్రికా విలేఖరినని అబద్ధం చెప్పి తనతో పరిచయం చేసుకున్న ఒక అందమైన అమ్మాయిని, తనేమాత్రం ఆకర్షించుకోలేకపోయానని తెలిసిపోయినా, ఆమెకోసం ఎందుకలా తపించాడు? అందనివాటికే విలువనిచ్చే మనస్తత్వం ఒక బూర్జువా కళాకారుడికి తప్పదా? తప్పించుకోవాలని ఎంత ప్రయత్నించినా, ఎంతకీ తప్పించుకోలేక బూర్జువా జీవితానికీ, డబ్బుకీ అతను నిరంతరం బలి కావలసిందేనా!?

చాలా ప్రశ్నలకి జవాబులిస్తూ, ఆ జవాబులతోనే మరిన్ని ప్రశ్నల్ని రేకెత్తించటం 'రాయ్' ప్రత్యేకత కానీ ఒక బూర్జువా జీవితాన్ని 'రాయ్' సినిమాగా తీయటం హర్షించలేకపోయాను.

అసలు కళకీ, కళాకారుడి జీవితానికీ, ఆ రెండింటితో సమాజానికీ గల సంబంధం ఎలాంటిది? — చాలా పెద్ద ప్రశ్న. సామాజిక దృక్పథం గల కళాకారుడికి పూర్తి స్వాతంత్ర్యం వుందా? లేదా?... ...???

ఆలోచిస్తూనే 'టి. నగర్' వెళ్లే బస్సుకోసం ఎదురుచూస్తూ నిలబడ్డాను. నా ఎదురుగా ఒక టాక్సీ వచ్చి ఆగింది. వెనక సీటులోంచి ఒకాయన చెయ్యి వూపాడు. నాకోసం కాదేమో అని చుట్టూ చూశాను. కానీ అతను నా వయిపే చూస్తున్నాడు. కాస్త తికమకపడ్డాను. కారు దిగి చిరునవ్వు నవ్వుతూ చూశాడు. వెంటనే పోల్చుకున్నాను. నిరంజనం!

"హలో నిరంజనంగారూ!" అన్నాను ఆశ్చర్యంగా చూస్తూ. చేయి అందించాను. ఆప్యాయంగా రెండు చేతులతో అందుకున్నాడు.

"అమ్మయ్య, పోల్చుకున్నారన్నమాట. రక్షించారు" అన్నాడు ఆనందాన్ని వ్యక్తంచేస్తూ.

"అంత మాటనకండి, మీరు నాకు బాగా గుర్తున్నారు?"—వెంటనే పోల్చుకోలేకపోయినందుకు కొంచెం సిగ్గుపడుతూ అన్నాను.

"నాకు మాత్రం ఆ రోజు మనం 'కోణార్క్'లో గడిపిన ప్రతి క్షణం గుర్తుంది" అన్నాడు స్నేహంలో తనదే పైచేయి అన్నట్టు కాస్త గర్వంగా.

"నిజంగా!"

"ఇంతకీ యిక్కడ నిలబడ్డారేం?"

"ఏం లేదు — యిప్పుడే సినిమా చూసి బయట పడ్డాను. బస్సుకోసం ఎదురు చూస్తున్నాను."

"అంత అవసరమైన పనా?"

"అబ్బే — పనేంలేదు. రేపు మధ్యాహ్నం వరకూ ఖాళీయే."

"అలా అయితే మీరు నాతో యిప్పుడే రావాలి. ఈ రోజు నాతో మీరు నా అతిథిగా గడపాలి."

"అదేవిటి? మా వూరికి వచ్చి నాకే ఆతిథ్యం యిస్తున్నారే? — కొంపతీసి ఆ రోజు నా ఆతిథ్యానికి బదులా యిది?"

"అదేం కాదు — పోనీ, అలానే అనుకోండి — కానీ మీరు అభ్యంతరం చెప్పకండి."

"అభ్యంతరం ఎందుకు? భలేవారే — మీతో గడపడం నాకూ యిష్టమే."

"అయితే రండి — టాక్సీ ఎక్కండి."

. . ఇద్దరం టాక్సీలో కూర్చున్నాం. టాక్సీ కదిలింది.

నిరంజనం పూర్తిగా నావయిపే తిరిగి కూర్చున్నాడు. అతని వైఖరి చూస్తుంటే ఆ రోజున కోణార్క్‌లో అతన్ని బాగా ఆకర్షించాననిపిస్తోంది. ఏదో ఒకటి అడగాలని నోరు విప్పాను, లేకపోతే బాగుండదని.

"నిరంజనంగారూ! ఈ వూళ్లో ఏం పని మీకు? మీ వ్యవహారం అంతా ఒరిస్సాయే కదా."

"అవును, కానీ యిక్కడ మా కంపెనీవాళ్లు మా రిప్రజెంటేటివ్‌లు అందరికీ ఒక 'కాన్ఫరెన్సు'ని ఏర్పాటు చేశారు. కొన్ని కొత్త మందుల్ని మా కంపెనీ మార్కెట్లోకి పంపించబోతోంది. మరో వారం రోజులుంటానిక్కడ. అది సరే, రేపు మధ్యాహ్నం మీరు వెళ్లితీరాలా?"

"తప్పకుండా వెళ్లితీరాలి. మా కొత్త సినిమాకి రేపట్నుంచి మా ప్రొడ్యూసరుగారింట్లో 'మ్యూజిక్

ంహాల్పల్లున్నాయి. నముండలిరాలి.

"సరే. రేపు మధ్యాహ్నం వరకూ నాతో వుంటారుగా, చాలు. ఇప్పుడు మనం తిన్నగా నా లాడ్జికి వెళ్దాం. స్నానం చేసి, భోజనం ముగించి ఏదైనా మంచి సినిమాకి వెళ్దాం. ఆ తరువాత..."

"వద్దు. సినిమాకి మాత్రం వద్దు. అసలెక్కడికీ వద్దు, మీ గదిలోనే వుండి మనసారా మాట్లాడుకుందాం. అదే మీరు నాకిచ్చే నాకు నచ్చే ఆతిథ్యం" అన్నాను కొంచెం హాస్యాన్ని జోడిస్తూ. అతనుకూడా హృదయపూర్వకంగా నవ్వేడు.

'నేషనల్ లాడ్జింగ్స్' దగ్గర టాక్సీ ఆగింది. ఇద్దరం దిగాం. డబ్బులిచ్చి టాక్సీని పంపించేశాడతను. నాల్గంతస్తుల ఆ భవనాన్ని చూస్తూ అడిగాను.

"మీ మెడికల్ రిప్రజెంటేటివులు సాధారణంగా యిలా లాడ్జింగుల్లో కాక వేరేగా ప్రతి పట్నంలోనూ 'మెస్'లు ఏర్పాటు చేసుకుని అక్కడే వుంటుంటారనుకుంటాను. మరి మీరు యిక్కడ దిగారేం ?"

"నేను మాత్రం వీలయినంతవరకు యిలా లాడ్జిల్లోనే వుంటుంటాను. ఆ మెస్సులు నాకు నచ్చవు. నా వృత్తికి సంబంధించిన ఆ ప్రపంచానికి దూరంగా — ఏకాంతంగా వుండటానికే ప్రయత్నిస్తుంటాను. ఒక 'మెడికల్ రిప్రజెంటేటివ్'కి యిలాంటి ఆలోచనలు వుండకూడదు కదూ !" అన్నాడు నా భుజాన్ని చరిచి కొంచెం బిగ్గరగా నవ్వుతూ. అంతగా నవ్వాల్సిన విషయం అందులో ఏముందో నా కర్థంకాలేదు.

కిందటి వేసవి రోజుల్లోనే నేను కోణార్క్ వెళ్లాను. మేం తీయబోయే ఒక శృంగారభరిత చిత్రానికి కావలసిన 'ఔట్‌డోర్ షాట్స్' కోణార్క్‌లో తీయాలని మా 'ప్రొడ్యూసర్' గారికి కోరిక పుట్టింది. మా 'డైరెక్టర్'గారు కూడా సరే నన్నారు. 'లొకేషన్స్' తాలూకు ఫోటోలు తీసుకు రమ్మని నన్ను పంపించారు. మేం తీయబోయే చిత్రం రంగుల్లో కాబట్టి ఒక 'కలర్' రీలు నింపి 'రోలీఫ్లెక్స్ — ఎస్. ఎల్. 66' కెమేరాని, మామూలుగా నేనెప్పుడూ తీసుకువెళ్లే 'యషీకా — లిన్క్స్' 35 ఎం. ఎం. కెమేరాలో తెలుపు నలుపు రీలు నింపి, రెండు కెమేరాలని వాటితోపాటు నా 'ఎలక్ట్రానిక్ ఫ్లాష్‌గన్'ని పట్టుకుని బయల్దేరాను కళింగ రాజ్యానికి.

కోణార్క్‌లోని శిథిలావస్థలో నున్న సూర్య మందిరాన్ని, మందిరంపై కళింగ శిల్పులు చెక్కిన ఆ అమర శిల్పాల్ని చూడగానే నన్ను నేనే మరచిపోయాను. ఒక్కొక్క శిల్పాన్నే తదేకంగా చూస్తూ తన్మయత్వం చెందుతూ, శిథిలమైపోయిన ఆ శిల్పాల్ని చూసి విచారిస్తూ చాలాసేపు గడిపేశాను. కర్తవ్యం వెన్ను తట్టగా మేం 'హీరో, హీరోయిన్ల' మీద తీయబోయే ఒక పాట కోసం కావలసిన శృంగార శిల్పాల్ని రంగుల రీలుమీద, నాక్కావలసిన వాటిని నా కెమేరాలోని నలుపు తెలుపు రీల మీద ఎలాగో కష్టపడి తీస్తున్నాను. ప్రయాణంలో ఎలా జరిగిందోగాని నా ఎలాక్ట్రానిక్ ఫ్లాషగన్ పాడయింది.

ఒక ఆరేడడుగుల పురుష విగ్రహం నన్ను చాలా ఆకర్షించింది. అరమోడ్పు కనులతో ప్రశాంత వదనం. రెండు చేతుల్నీ విరగ్గొట్టేశారెవరో. కాని, ఆ వదనంలో ప్రశాంతత చెక్కుచెదరలేదు. యథాతథంగా కెమేరా కెక్కించాలని కోరిక పుట్టింది. రంగుల్లో అయితే మరింత శోభిస్తుంది. కానీ ఆ విగ్రహంమీద బాగా నీడ పడుతోంది. నా దగ్గరున్న కలరు ఫిల్ము. '16 ఎ. ఎస్. ఏ. స్లో' ఫిల్ము, ఫ్లాష్ లైట్ వుంటేనేగాని లాభంలేదు. 'టైమింగ్' యిచ్చి తీస్తే అవుతుంది కానీ కెమేరాని నిలకడగా వుంచి తీసేందుకు అవకాశం లేదు. 'అపర్చర్'ని పూర్తిగా తెరచి తీస్తే అవుతుంది కానీ నాక్కావలసిన 'డెప్త్ ఆఫ్ ఫీల్డు' వుండదు ఫోటోలో. ముఖ్యంగా ఆ వదనంలోని ప్రశాంతతనీ, ఆ అరమోడ్పుకనుల అందాన్ని తీయాలంటే 'డెప్త్' వుండాలి. దానికి 'ఫ్లాష్' కావాలి. ఫ్లాష్‌గన్ పాడయినందుకు నన్ను నేను మరీ తిట్టుకున్నాను. నా 'యషీకా'తో రెండు 'స్నాప్స్' తీశానుగానీ: అది తెలుపు నలుపు రీలు. ఎండ బాగా వచ్చేంతవరకూ వేచివుండాల్సిందేనా అని ఆలోచిస్తున్నాను. ఇంతలో ఎవరో ఒకతను '35 మి. మి. ఒలింపస్' కెమేరాకి ఎలాక్ట్రానిక్ ఫ్లాష్‌గన్ తగిలించి ఫోటోలు తీస్తున్నాడు.

'అతన్నొకసారి ఆ 'ఫ్లాష్'ని అడిగితే? ఇస్తాడా? ఇవ్వనంటే...? పరువు పోతుంది. కానీ... సిగ్గుపడితే లాభంలేదు. కళాకారుడికి కళ ముఖ్యం. తిన్నగా వెళ్లి అడిగాను, యింగ్లీషులో చాలా మర్యాదగానే. అతను వెంటనే అడిగాడు, "మీరు తెలుగువారా" అని. నా యింగ్లీషులో తెలుగుతనం అంత ప్రస్ఫుటంగా వుందా అని ఆశ్చర్యపోతూ అవునన్నాను

"నేనూ తెలుగువాణ్ణే ! నా పేరు నిరంజనం. 'ఫైజర్' కంపెనీలో మెడికల్ రిప్రజెంటేటివుగా పని చేస్తున్నాను." అని చేయి అందించాడు.

"నా పేరు ఆనందరావు. ప్రఖ్యాత తెలుగు సినిమా దర్శకులు శ్రీ రాఘవరావుగారి పేరు వినే వుంటారనుకుంటాను. ఆయన దగ్గర నేను 'ఎసోసియేట్'గా పని చేస్తున్నాను " అన్నాను అతని చేయినందుకుని స్నేహపూర్వకంగా.

"ఒహో ! మీరు సినిమావాళ్లన్నమాట" అన్నాడు కళ్లెగరేస్తూ. మద్రాసులో అయితే ఎవడూ పట్టించుకోడుగానీ, యిలా పై వూళ్లకి వచ్చినపుడు సినిమావాళ్లకి మంచి గౌరవం లభిస్తూ వుంటుంది. ఏదో వింత లోకంనుండి వచ్చిన వ్యక్తుల్లా కనిపిస్తారేమో.

"ఇంత దూరం వచ్చారేం ? ఒరిస్సా చూద్దామని బుద్ధి పుట్టిందా ?" అని అడిగాడతనే మళ్లీ.

"మా తదుపరి చిత్రానికి కావలసిన 'ఔట్‌డోర్ షాట్స్'కి ఈ కోణార్క్ ఏమైనా బాగుంటుందేమో అని, చూసిరమ్మని, వీలయితే ఫోటోలు తెమ్మని మా ప్రొడ్యూసరుగారు నన్ను పంపించారు."

"ఒరిస్సామీద కన్ను పడిందే మద్రాసువాళ్లకి. ఏమిటో మీ సినిమా ప్రత్యేకత ?"

"ప్రత్యేకతేంలేదు. రహస్యం చెప్పమంటారా ? మేం తీయబోయేది కొంచెం శృంగారభరితం. ఈ కోణార్క్ శిల్పాలు శృంగార రసంతో నిండి వుంటాయని మా ప్రొడ్యూసరుగారికి ఎవరో చెప్పారు. ఇటు ప్రాచీన కళ పేరుతో వీటిని చూపిస్తూ అటు శృంగారాన్ని యిష్టం వచ్చినట్లు గుప్పిస్తూ, కళాత్మక చిత్రం అని ప్రశంసలతో సెన్సారువారి కత్తెరపోట్లనుండి తప్పించుకోవటానికి యిదొక ఎత్తుగడ" అన్నాను కన్నుగీటుతూ.

నిరంజనం బిగ్గరగా నవ్వేడు. అలా నవ్వుతూనే అడిగాడు — "ఫ్లాష్‌గన్ అడిగారు — మరి ఏ శృంగార శిల్పాన్ని తీద్దామని".

"అది కాదు — నాకోసం. ఎంత అమ్ముడుపోయిన కళాకారుణ్ణయినా, అప్పుడప్పుడీ కళా హృదయం స్పందిస్తూ వుంటుంది. చూడండి; యీ ఎత్తయిన పురుష విగ్రహాన్ని. ఎంత నిండుతనం ! ఆ వదనాన్ని చూశారా ? ఎంత ప్రశాంతత ! ఏ శిల్పి అపూర్వ సృష్టో యిది ! ? అలా ఆ మెళ్లో జంధ్యం చూడండి. జంధ్యానికి వేళ్లాడుతూన్న చిరుకుచ్చెలు, మొలకున్న వెడల్పు పటకా, కొళికి బిళ్లా, యెంత అందంగా చెక్కాడో శిల్పి ! ఆ పటకాకి వేలాడుతూ తొడలనంటుతూన్న చిరుగంటలు ఎంత రమ్యంగా వున్నాయని ! ఆ గంటల నాలికలనుండి వేలాడుతూన్న తాళ్లూ, వాటి చివర కుచ్చెళ్లూ, ఆ కుచ్చెళ్ల చివర పాదాలనంటి జీరాడుతూన్న బ్రహ్మాండమైన పతకం — ఎంత నేర్పుగా చెక్కాడో ! సాక్షాత్తూ ఆ దేవుణ్ణే ఈ శిల్పంలో బంధించేశాడు కదూ" — అన్నాను తన్మయత్వంతో.

"చక్కగా చెప్పారు. ఆ పక్కనున్న ఎనిమిది విగ్రహాలు చూడండి. అవి మిగతా ఎనిమిది గ్రహాల శిల్పాలు. మీకు నచ్చినది యీ మందిరంలో ప్రతిష్ఠించవలసివుండిన సూర్యభగవానుడి విగ్రహం" అన్నాడు నిరంజనం.

అక్కణ్ణుంచి యిద్దరం కలిసి చాలా ఫోటోలు తీశాం. అతనికి కెమేరాని వాడటం యింకా సరిగా రాదు. కొత్తగా కొన్నాడట. అతనికోసం కూడా నేనే ఫోటోలు తీశాను. కెమేరా భాషని కొంత నేర్పించాను. అతని 'ఫ్లాష్‌గన్'ని నాకోసం బాగా వుపయోగించుకున్నాను.

పదమూడవశతాబ్దంలో యీ కోణార్క్ మందిరాన్ని నిర్మించిన కళింగరాజు నృసింహదేవు గురించి, కోణార్క్ మందిరాన్ని, ఆ విగ్రహాల్ని చెక్కిన ఆ స్థపతి బిసుమహరణా, అతని కుమారుడు ధర్మపాదుడు గురించి, వారి శిల్పకళా నైపుణ్యం గురించి, పూరీ భువనేశ్వర్‌ల ప్రశస్త్యాన్ని, ఓఢ్రవీరుల ప్రతాపం — చాలా విషయాలు చెప్పాడు నిరంజనం. తను జన్మతః తెలుగువాడేకానీ, పెట్టి పెరిగినది, విద్యాబుద్ధులు నేర్చినది ఒరిస్సాలోనేనట. కొద్దిసేపట్లోనే అతడికీ నాకు చాలా స్నేహం కలిసింది. చాలా చనువుగా మాట్లాడుకున్నాం.

"పున్నమి రాత్రుల్లో కోణార్క్ సముద్రతీరం చాలా అందంగా వుంటుంది. ఈ మందిరంకూడా చాలా బాగుంటుంది. ఈ రాత్రి మీరిక్కడ వుంటున్నారా ?" అని అడిగాడు నన్ను.

"ఉండాలనేకదా యింత దూరం వచ్చాను. మీరుకూడా వుండరాదూ. 'ఇన్‌స్పెక్షన్ బంగ్లా'లో నా రూములో వుండండి. ఈ వెన్నెల రాత్రిలో యివన్నీ తిరుగుదాం. సరదాగా వుంటుంది. ఇక్కడ

(34 వ పేజీ చూడండి)

భాష నాకు రాదు. నాకు తోడుగా కూడా వుంటారు'' అన్నాను కొంచెం అభ్యర్థనగా.

అతను నవ్వి ''ఈ రాత్రికి వుంటానులెండి. కాని ఉదయం కటకం వెళ్లిపోవాలి. చాలా పనులున్నాయి'' అన్నాడు.

ఆ రాత్రి వెన్నెల్లో సుమారు రెండు మైళ్ళు నడిచి సముద్రతీరానికి వెళ్ళాం. నిరంజనం చాలా విషయాలు చెప్పాడు తన గురించి. తన కుటుంబ విషయాలని ఆత్మీయుడికి చెబుతున్నట్టుగా చెప్పాడు. నా వృత్తి గురించి ఎన్నో ప్రశ్నలడిగాడు వెన్నెల వెలుగులో సముద్రాన్ని చూస్తూ, చంద్రభాగ నది ఒడ్డున ఆహ్లాదకరమైన ఆ వాతావరణంలో ఒళ్లు మరచి నేను రెండు పాటలుకూడా పాడాను. చాలా మెచ్చుకున్నాడు నిరంజనం.

(అసలా సముద్రపు హోరులో అతనికి సరిగా వినిపించిందా? అని?)

సుమారు రాత్రి పన్నెండు గంటలకి సూర్య మందిరాన్ని చేరుకున్నాం. వెండివెన్నెల వెలుగుల్లో కోణార్క్ మందిరం యొక్క ప్రాచీనత, ఆ నిశ్శబ్దత కొట్టవచ్చినట్టు కనిపించాయి. నేను మరి మాటాడలేదు. మౌనంగా ఆ మందిరంచుట్టూ తిరిగాను. మళ్లీ కొత్తగా చూస్తున్నట్టు ప్రతి శిల్పాన్ని చూశాను. నిరంజనంకూడా నోరు విప్పకుండా నాతో తిరిగాడు. తరువాత నా గదికి వచ్చేశాం. అక్కడ మళ్లీ నిరంజనం సినిమాల గురించి, నటీనటుల గురించి అడగటం ప్రారంభించాడు. నిద్ర వస్తున్నా ఓపికపట్టి చాలా చెప్పాను. ఆ రాత్రి మరి నిద్రపోలేదు.

ఇంకా సూర్యోదయం కాకుండానే కెమేరాలు తీసుకుని సూర్య మందిరాని కెళ్లాం. సూర్యుడి తొలి కిరణాలు సూర్య మందిరంమీద పడుతున్నపుడు, ఆ వెలుగునీడల్ని దూరాన్నించి ఫొటోలు తీశాను. నిరంజనం కోసంకూడా నేనే తీశాను. రంగుల్లో తీసిన ఆ ఫొటో కాపీని తనకీకూడా ఒకటి పంపించమని కోరాడు. తప్పకుండా పంపిస్తానని అతని చిరునామా తీసుకున్నాను. కానీ అతని చిరునామా రాసుకున్న కాగితం అప్పడే ఎక్కడో పోయింది.

ఉదయం ఎనిమిదిగంటల బస్సులో అతను కటకం వెళ్లిపోయాడు. మళ్లీ కలవటం అనుకోకుండా యిప్పడే. 'ఫొటోలు యెందుకు పంపించలేద'ని అడుగుతాడేమో అని కొంచెం భయపడ్డాను.

''ఏమిటంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?'' అని అడిగాడు మూడో అంతస్తులో వున్న తన గది తాళంవేస్తూ.

''ఏంలేదు. ఆరోజు మనం కోణార్క్‌లో గడిపిన విషయాలు గుర్తొచ్చాయి.''

''కోణార్క్‌లో మీ సినిమా తీశారా?'' అన్నాడు గది లోపలికి ప్రవేశిస్తూ.

''లేదు. ఔట్‌డోర్‌కి అక్కడ చాలా చక్కటి ప్రదేశాలున్నాయి గానీ సదుపాయాలు లేవు ఖర్చుకి జడిసి మా నిర్మాత వెనకడుగు వేశారు. కోణార్క్ గనుక యీ తమిళదేశంలో వుండివుంటే కనీసం వంద సినిమాల్లో అయినా కనిపించివుండేది''

# కళాకారులిద్దరూ

(25 వ పేజీ తరువాయి)

అన్నాను.

''పాపం! మీ ప్రొడ్యూసర్‌గారికి ప్రేక్షకుల్ని చకితుల్నిచేసి వాళ్ల జేబుల్లో పర్సుల్ని కొట్టేసే అవకాశం దొరికలేదన్నమాట. కానీ, ఆనందరావు గారూ! వాటిలో చాలావరకు శృంగార శిల్పాలు భువనేశ్వరంలోని త్రిభువనేశ్వరాలయంమీద, రాజారాణీ ఆలయంమీదా, లింగరాజాలయంమీదా వున్నాయి'' అన్నాడు నాకో పెద్ద సహాయం చేస్తున్నట్టు.

''ఉన్నాయి. నేను చూశాను: కానీ తీర్థ్రవజ వుండేచోట సినిమా తియ్యలేం. ఆ పైన ఆ ఆలయం ధర్మకర్తలు అసలు అంగీకరించరు. కోణార్క్ శిధిలావస్థలో వుందిగాబట్టి...'' అన్నాను అర్థోక్తిగా.

'అవునవును'' అని లోపలికి దారితీశాడు. అతని గదిని పరిశీలనగా చూశాను. అతని మంచంమీద ఫిడేలు, కమాను కనిపించాయి. అతనివైపు ఆశ్చర్యంగా చూస్తూ ''మీరు ఫిడేలు వాయిస్తారా?'' అని అడిగాను. అతను అంగీకారంగా నవ్వేశాడు, అదో చిన్న విషయం అన్నట్టు.

''అలా నాన్చేయకండి. మీరు వాయించాలి. నేను మీ అతిథిని అభ్యంతరంచెప్పే అధికారం మీకు లేదు.''

''అగ్యా! రోజంతా తిరిగి తిరిగి చీదరగా వుంది. స్నానంచేసి వస్తాను. మీరు కూర్చోండి ఆ కుర్చీమీద — పోనీ మీరుకూడా స్నానం చెయ్యరాదూ''

''లేదు — సాయంత్రం స్నానం నా ఆరోగ్యానికి పడదు. మీరు చేసిరండి'' అన్నాను కుర్చీలో కూర్చుంటూ. నిరంజనం స్నానానికి వెళ్లాడు.

ఆరోజు కోణార్క్‌లో తన గురించి కుటుంబ విషయాలుసైతం చెప్పాడుగానీ, తను ఫిడేలు వాయిస్తాడనీ, తనొక కళాకారుడనీ యెందుకు చెప్పలేదు? బహుశా నేను సినిమావాణ్ణి గనుక, యివన్నీ నా దృష్టిలో చిన్నవిగా అనుకుంటానేమో అని చెప్పకపోయివుంటాడు. ఫిడేలునీ, కమానునీ అందుకుని ఫిడేలుని గట్టిగా భుజానికి అణిచి కమానుతో తీగలమీద రాశాను. భయంకరమైన శబ్దాలు వెలువడ్డాయి. వెంటనే వుంచేశాను మంచంమీద. పక్కనే వున్న సినిమా పత్రికల్ని తిరగవేస్తూ కూర్చున్నాను. నిరంజనం స్నానం ముగించి వచ్చి, తెల్లటి లాల్చీ, పరాయి వేసుకున్నాడు. నా ఎదురుగా కూర్చుంటూ — ''ఇక చెప్పండి అతిథిదేవా! ఏం చేదాం'' అన్నాడు హాస్యంగా.

''మీ నైపుణ్యాన్ని ప్రదర్శించండి ఫిడేలుమీద'' అన్నాను గుర్తుచేస్తూ.

''ముందు భోజనం కానీండి. రూమ్ బోయ్‌కి చెప్పాను. మిఠాయి, భోజనం తెస్తాడు. మొహమాటపడకుండా తినాలి.'' అన్నాడు. నా కలవాటుంటే 'హాట్ (డ్రింక్స్)' తెప్పిస్తానన్నాడు.

''ఏం మీకు అలవాటులేదా?''

''లేదు. కానీ అప్పుడప్పుడు పరీ బలవంతం మీద తాగుతుంటాను. అసహ్యం నాకు.''

''నేనూ అంతే. కానీ అసహ్యంతోకాదు. కావలిసే దూరంగా వుంటున్నాను'' అన్నాను.

నాకొక కొత్తలుంగీ యిచ్చాడు కట్టుకోమని. భోజనం రాగానే సరదాగా మాట్లాడుకుంటూ ముగించాం. నాచేత చాలా తినిపించాడు. తరువాత మంచంమీద కూర్చుని ఫిడేలు, కమాను అందుకున్నాడు. శ్రుతి సరిచేశాడు. రెండు మూడు సార్లు కమానుతో తీగలపై లలితంగా రాసి స్వరాలు పలికించాడు. అలా చేస్తున్నంతసేపూ అతని మొహంలో అంతకుముందు లేని ఏకాగ్రతని గమనించాను. నా వైపు చూసి కళ్లెగరేస్తూ ''ఇక చెప్పండి ఆనందరావుగారూ? ఏమిటి వాయించమంటారు? శాస్త్రీయ సంగీతమా? సినిమా పాటలా?'' అని అడిగాడు.

''మీ యిష్టం — ఏదయినాసరే''

''త్యాగరాజ కీర్తన. నను పాలింప నడచి వచ్చితివో — మోహన రాగం వాయిస్తాను'' అన్నాడు.

నేను సరేనన్నట్టుగా తలాడించాను.

''మీరు క్షమిస్తానంటే నాదో మనవి.''

''ఏమిటి?''

''సాధారణంగా సాంప్రదాయం ప్రకారం ముందు కొంత రాగాలాపన చేసి ఆ తరువాత శ్రుతి వాయించటం రివాజు. కానీ ఒక్కోసారి నేను దీనికి భిన్నంగా నా మనసు ఆనందంతో గంతులు వేస్తున్నపుడు నాకెంతో యిష్టం అయిన రీతిలో వాయిస్తుంటాను. ఈ మోహన రాగం నాకు చాలా యిష్టం''.

''నాకేం అర్థం కాలేదు'' అన్నాను అమాయకంగా.

''ముందు ఆలాపన వాయిస్తాను. అందులోంచే 'వరవీణా మృదుపాణీ' అన్న గీతంలోకి వెళ్లి, ఆ గీతంలోంచి ఆ రాగంమీదే వీణా కుప్పయ్యగారి ఆట తాళంలో చెప్పిన 'సరసిజాక్షి' అన్న వర్ణం వాయించి, ఆ వర్ణంలోంచి 'భవనుత'లోకి వెళ్లి, చివర 'బడలికదీర కమల సంభవానుత' అని, అక్కణ్ణుంచి ఒక్క వూపున 'గపా, గరీ — సరిగా, రిస — సారీ సద — సారీరీ' అని పల్లవిలోకి దిగి, ఆ వెంటనే ఆ వూపుతోనే 'నను పాలింప నడచి వచ్చితివో' కృతి పూర్తిచేస్తాను. అలా చేస్తేనే నాకు తృప్తిగా వుంటుంది'' అన్నాడు నా అంగీకారం కోసం అన్నట్టుగా, చిన్న పిల్లాడిలా చూస్తూ.

''అలాగే. తప్పకుండా అలాగే వాయించండి. కాని యిదంతా నాకేదో కొత్తగా వుంది'' అన్నాను ఆసక్తిగా. అతను చిన్నగా నవ్వేసి తనకి తను సర్దుకుని వాయించటం మొదలుపెట్టాడు.

కొద్ది క్షణాల్లోనే తన లోకానికి — తన సంగీత ప్రపంచానికి నన్ను యీడ్చుకునిపోయాడు. శాస్త్రీయ సంగీతంలో నాకంత ప్రవేశం లేదు. నన్నో ప్రజ్ఞావంతుడిగా గణించి వివరాలు చెప్పి ఏకాగ్రతతో వాయిస్తున్నాడు. రసాస్వాదనలో మునిగి పోయాను; అరచేత్తో తాళం వేస్తూ. చివరకి త్యాగరాజ కీర్తన 'నను పాలింప నడచి వచ్చితివో' అందుకున్నాడు. కళ్లు మూసుకుని అతని సంగీత సామ్రాజ్యంలో విహరించసాగాను. సాక్షాత్తు ఆ త్యాగరాజే నా కళ్లముందు ఆలాపిస్తున్నట్టని పించింది.

(ఇంకా వుంది)

# కళాకారులిద్దరూ

**కె. యల్. ప్రసాద్.**

*(గత సంచిక తరువాయి)*

**త**నకి తండ్రి తాతల నుండి వారసత్వంగా వచ్చినట్టే, తను భక్తితో నిరంతరం పూజిస్తున్నట్టే రామ విగ్రహాల్ని తన అన్నగారు కావేరీ నదిలో పారేశాడు. ఎంత వెదికినా దొరకలేదు. వెతికి వెతికి వేసారేడు రాత్రి రాములవారు కలలో అవుపించి, ఏట్లో ఫలానాచోట వెతకమన్నారు. తెల్లవారింది. కావేరీ నదిలో దిగాడు — "అదిగో రాములవారు — సీతాసౌమిత్రీ సమేతంగా ఎదురుగా వస్తున్నారు — 'నను పాలింప నడచివచ్చితివో — నా ప్రాణనాథ' — ఎంత దూరం నడచివచ్చావయ్యా! — నామీద ఎంత నిర్హేతుక జాయమాన కటాక్షవయ్యా నీకు! అదిగో నిండు కావేరీ రెండుగా చీలిపోయి నీకు దారిస్తోంది — 'అనుజ నయనా నీ మోము జూచుటే' — అబ్బ! భరించలేను. నేను భరించలేను యీ ఆనందం — 'కరమున శర కోదండ కాంతితో' — ఎంత కృపయ్యా నేనంటే నీకు, నువ్వే నడచి వస్తున్నావే నా యింటికి. ఇంత అదృష్టవా నాకు! — 'గగ, పప, దద, సస' — ఈ జంట స్వరాల్తో నా గుండె పరిగెత్తుతూందయ్యా నీ దగ్గరకి — 'దగరిసదప, దరిసదప; గదపగరి, రిపగరిస' — ఈ దాట్లతో నా మనసు నీ దగ్గరకి దాట్లు వేస్తోందయ్యా. భరించలేను రామా! ఈ ఆనందం యిహ భరించలేను. 'ధరణి తనయతో త్యాగరాజార్చిత! నను పాలింప నడచివచ్చితివో — నా ప్రాణనాథ!' నా గుండె నిండిపోయింది. నీ నిండు కటాక్షంతో..."

ఆర్ద్రతతో నా హృదయం నిండిపోయింది. నా కళ్ల నుండి నాకు తెలియకుండానే నీళ్లు కారుతున్నాయి. పాట అయిపోగానే కళ్లు తెరచి చూశాను. కన్నీటి తెరలమధ్య కొత్తగా కనిపించాడు నిరంజనం నాకు. కళ్లు తుడుచుకున్నాను. ఇంతకు ముందులా అతన్ని చూడలేకపోయాను. ఇంతసేపూ ఒక స్నేహితుడిగా, సినిమాల గురించి ఆసక్తిగా అడిగే ఒక ప్రేక్షకుడిగా, ఒక మెడికల్ రిప్రజెంటేటివ్‌గా, నా దగ్గర ఫొటోగ్రఫీ గురించి అమాయకంగా అడిగి తెలుసుకుంటున్న సామాన్యుడిగా అతన్ని చూశాను. ఇప్పుడు ఒక గొప్ప కళాకారుణ్ణి, తన కళతో రాతిని సైతం కదిలించగలిగే విద్వాంసుణ్ణి చూస్తున్నాను. కొంతసేపువరకు మాట్లాడలేకపోయాను. నిరంజనం చిరునవ్వుతో చూస్తున్నాడు. ఎలాగో గొంతు పెగల్చుకున్నాను.

"నిరంజనంగారూ! వూహించలేకపోయాను, మీలో యింత ప్రజ్ఞ వుందని. నిజంగా చాలా..."

'ఈ త్యాగరాజ కృతిని మీరు యింతకుముందే వినివుంటారు. సాధారణంగా బాలమురళి కచేరీలలో పాడుతూవుంటారు. ఆ విన్నదాన్నే నేను వాయించటానికి ప్రయత్నించాను." అన్నాడు నా మాటల్ని తుంచేస్తూ. అతనికి పొగడ్త యిష్టంలేదని గ్రహించాను. అతనిమీద గౌరవం మరింత ఎక్కువైంది.

"నేనూ విన్నాను బాలమురళి గానాన్ని చాలాసార్లు. కానీ అందులో భక్తికన్నా అతని ప్రతిభే కనిపిస్తుంది నాకు" అన్నాను.

"అంత మాటనకండి. అతని పాట వింటుంటే మళ్లీ త్యాగరాజే పుట్టాడా అనిపిస్తుంది. అతనిచ్చిన గ్రామఫోను రికార్డునుండే నేను నేర్చుకుని సాధన చేశాను."

"ఎన్ని చెప్పండి — మీ వాద్యంలో..."

"సర్లెండి. ఇప్పుడు మీ కిష్టమయినది చెప్పండి. ప్రయత్నిస్తాను.'

అతని మనోగతం అర్థమైంది నాకు.

"సైగల్ పాటలు వాయించగలరా? చాలా యిష్టం నాకు. ఏదైనా ఒక విషాద గీతాన్ని వాయిస్తారా?"

"నాక్కూడా చాలా యిష్టం ఆ అమర గాయకుడి విషాద గీతాలు. 'జబ్ దిల్ హి టూట్‌గయా' వాయిస్తాను" అన్నాడు. ఆ పాటని నేను కొన్ని వందలసార్లు విన్నాను. వింటున్న ప్రతిసారీ నా గుండె బరువెక్కిపోతుంది. నిరంజనం ఏకాగ్రతతో తన ఫిడేలుమీద వాయిస్తూవుంటే, నన్ను నేనే మరచిపోయాను.

సైగల్ పాటల్ని కొంతమంది పేరెన్నికగన్న గాయకులు పాడగా విన్నాను. కానీ ఎవరూకూడా న్యాయం చేయలేదు. సైగల్ పాడేది గొంతుతో కాదు, హృదయంతో. మళ్లీ యీ రోజు ఆ విషాదాన్ని, పాటలోని భారాన్ని నిరంజనం ఫిడేలుమీద వింటున్నాను.

"నిరంజనంగారూ! ముఖస్తుతి అనుకోకండి. నిజం చెప్తున్నాను. మీ వాద్యంలో అమరత్వం వుంది. ఎంతోమంది కళాకారుల కచేరీలని విన్నాను. కానీ యింతగా తన్మయత్వం చెందలేదు. ఫిడేలుమీద మీకున్న ఏకాగ్రత అంత సామాన్యంగా పట్టుబడేది కాదు." ఇంకా ఏదైనా అనాలని అనుకున్నానుగానీ సాధ్యం కాలేదు. నిరంజనం నవ్వి వూరుకున్నాడు. నోరు విప్పలేదు. సైగల్ పాడిన 'కరుం క్యా ఆశ్ నిరాశ్ భాయీ', 'సోజా రాజకుమారీ' వాయించాడు. అతని కిష్టమైన ఎంకిపాటలు వాయించాడు. అక్కణ్ణుంచి వరసగా మీరా భజనలు, త్యాగరాజ కీర్తనలు, దేవులపల్లి గీతాలు వాయించాడు. ఒక్కో పాటకి ఒక్కోరకంగా అనిపించాడు. ఫిడేలు ఒక వస్తువులాకాక అతని శరీరంలో ఒక భాగమే అనిపించింది. నేను మరేం మాట్లాడి అతన్ని నొప్పించదలుచుకోలేదు. కొన్ని గంటలు అలా అతని నైపుణ్యాన్ని ఆస్వాదిస్తూ వుండిపోయాను.

ఫిడేలుని, కమానుని టేబిలుమీద వుంచేసి, మంచంమీద తలగడలు సరిచేసి విశ్రాంతిగా వాలిపోయాడు. పైకప్పు మీదకి దీర్ఘంగా చూసి, నావైపు తిరిగి ఒక నిట్టూర్పు విడిచి మెల్లగా అన్నాడు.

"ఆనందరావుగారూ! మీరు చాలా అదృష్టవంతులు. మీకు ఆనందాన్ని, తృప్తిని యిచ్చే 'కళ'నే మీరు జీవనాధారం చేసుకున్నారు. నావి పూర్తిగా రెండు ప్రపంచాలు. లేని చిరునవ్వుని వృత్తికోసం మొహానికి అంటించుకుని, అవతలి వ్యక్తిని ప్రసన్నం చేసుకోవటానికి మాటల మాలలు అల్లి, మందులు ప్రచారంచేస్తూ, వూరూరా తిరుగుతూ, నలగని బట్టలమధ్య నలిగిపోతూ, మర్యాద నటిస్తూ — ఒక జీవితం. నాకోసం, నా ఆనందంకోసం, నా తృప్తికోసం గంటలతరబడి నా గదిలో ఏకాంతంగా వయొలిన్ వాయించుకుంటూ — యింకొక ప్రపంచం. రెండింటికీ ఎక్కడా పొత్తు కుదరదు. చిన్నప్పట్నుంచీ యీ వయొలిన్ అంటే నాకు చాలా యిష్టం. మా అమ్మ నేర్పించింది. పెద్దయిన తరువాత ఒక గొప్ప విద్వాంసుడి దగ్గర ఇంకా బాగా నేర్చుకోవాలని చాలా కోరికగా వుండేది. మా అమ్మకికూడా. కానీ అవకాశం లేకపోయింది. ఆర్థిక పరిస్థితి! మా అమ్మ తనకున్న ప్రజ్ఞనంతటినీ నాకు ధారపోసింది. తరువాత నా అంతట నేనే సాధన చేసాను. రోజుల తరబడి ఆకలితో గడిపాంగానీ, యీ వయొలిన్‌ని మా అమ్మ అమ్మలేదు ... నన్నాకర్షించిన ప్రతి స్వరాన్ని, రాగాన్ని నా వయొలిన్ తీగెలమీద పలికించేంతవరకూ నాకు నిద్రపట్టేదికాదు. వేరే యితర సరదాలేవీ లేవు నాకు ఇదొక్కటే. నేను వయొలిన్ వాయించగలనని చాలామందికి తెలీదు. ఒక కళని కళగా చూడరు. ప్రదర్శిస్తారు; తమకి కూడా ఒక కళలో ప్రావీణ్యత వుందని. అందుకే నా కిష్టంవుండదు మెప్పుల్లో వుండటం...

ఈ కళారాధనే నన్ను, సాధారణంగా మెడికల్ రిప్రజెంటేటివులకి అలవాటయ్యే తాగుడి నుంచీ, వ్యభిచారం నుంచీ దూరంగా వుంచింది. డబ్బుకోసం, జీతంకోసం ఒక 'హిపోక్రయిట్'లా బతుకుతూ, నష్టపోతున్నదానికి, ప్రతిఫలంగా ఈ సంగీత సాధనలో ఆనందాన్ని పొందుతూ రోజులు గడుపుతున్నాను. సంగీతం, నా మానసిక జీవితానికి ఆలంబన. రోజుకి కనీసం ఒక గంటయినా వాయించకపోతే మనశ్శాంతి వుండదు. హుఁ! కానీ వీలుకుదరదు ... మీరు అదృష్టవంతులు. అభిరుచి, వృత్తి — రెండూ ఒకటిగా వున్న ప్రతి వ్యక్తీ అదృష్టవంతుడే. పదిహేనువందల రూపాయలు తెచ్చుకుంటున్నాను నెలకి. నిజం చెప్పాలంటే నాలాంటి పేదవాడికి యీ ఉద్యోగం దొరకడం అదృష్టవే. ఆనందంగా గడిచిపోయే కుటుంబం నాది. కానీ నాకు తృప్తిలేదు. ఏముంది యీ జీవితంలో? పుట్టినందుకు బతకాలి. బతకాలి కనుక ఏదో ఒకటి చేసి సంపాదించాలి. కానీ ఎందుకసలు జీవితం? అన్న ప్రశ్న వుదయించగానే అసంతృప్తి మొదలవుతుంది. నాకూ, నా కుటుంబానికీ సరిపోయేలా యిప్పుడొస్తున్న జీతంలో కనీసం మూడోవంతు — నేను ఒక కళాకారుడిగా బతికేందుకు దొరికితే యీ ఉద్యోగాన్ని వదిలేయటానికి సిద్ధంగా వున్నాను. తృప్తిగా బతకటం ముఖ్యం. ఈ ప్రచార జీవితం నాకు విసుగ్గా వుంది. యజమానులకి లాభాలు సంపాదించటంకోసం తప్పితే, యీ జీవితానికి మరో అర్థంలేదా?

నా కిష్టమైన జీవితం నాకెందుకు దొరకదు ? ఒక్కొక్కసారి యీ బాధని భరించలేక ఏడుస్తూ... మనిషి కోరిన ప్రతీదీ జరగదు ... యీ అసంతృప్తి నా కెప్పటికీ వుండేదే..."

కొన్ని నిముషాలు యిద్దరిమధ్య నిశ్శబ్దం. అతనికి కావలసింది ఓదార్పు కాదని నాకు తెలుసు. విషయాన్ని తప్పించాలనిపించింది.

"ఒక కళాకారుణ్ణి — అతని జీవితం ఎటువంటిదయినా సరే — అతను సాధనచేసి ఆరాధిస్తున్న కళలోనే స్పందింపజేసి, అతని హృదయాన్ని తథాతథంగా తెలుసుకోవచ్చునని 'సోమర్సెట్‌మామ్' ఒక కథలో నిరూపించాడు" అన్నాను.

"నిజమే ! ఎప్పుడూ ఎవరితోనూ నేను నా వయొలిన్ గురించి మాట్లాడలేదు. ఇంట్లో అయితే నా భార్య కూర్చుని నాతోపాటే ఆనందిస్తుంది. బతికున్నరోజుల్లో మా అమ్మ వినేది. ప్రోత్సహించేది. నన్ను సరిదిద్దేది. ఇప్పుడు నాకు నేనే విమర్శకుణ్ణి. కానీ యీరోజు ... నన్ను మీరు బాగా కదిలించారు ... చాలా పొద్దుపోయింది. ఇక పడుకోండి..." అన్నాడు, మంచంమీంచి లేస్తూ.

పడుకున్నానేగాని నిరంజనం చుట్టూ అల్లుకున్న ఆలోచనలవల్ల నిద్రపట్టలేదు. అతను— నేను ! కళాకారు లిద్దరూ వున్నాం. నేను వృత్తి కళాకారుణ్ణి. అతను ఔత్సాహికుడు నా కళ నన్ను పోషిస్తోంది. అతను కళని పోషిస్తున్నాడు. ఆరాధిస్తున్నాడు. మానసిక తృప్తిని మాత్రమే యిస్తుంది అతని కళ అతనికి. నా కళ నాకు డబ్బులుకూడా యిస్తోంది. కానీ తృప్తినిస్తోందా ? నా కళాజగత్తు ఒక మిథ్యాప్రపంచం — నటన ! అతనిది ఏకాంతంలో నిజమైనది ... కళ గురించి అతనిలో సంఘర్షణ వుంది. తపన వుంది. అదేమిటో తెలియక సతమతమవుతున్నాడు అశాంతితో బాధపడుతున్నాడు ... ఏకాగ్రతలో, నిశ్చలతతో తనకి తానై అభ్యసించి కైవసం చేసుకున్న కళాప్రజ్ఞ కేవలం తన ఆనందం కోసమేనా ? వేరే ధ్యేయం లేదా ? ... అతనికి మనశ్శాంతి కావాలి ... ఎలా ? ... తన కళని తను వృత్తిగా స్వీకరించలేకపోయాననే బాధ అతనిలోంచి పోవాలి ... ఎలా ? ... ఏం చేస్తే అతను నిత్య నూతనోత్సాహంతో, తన కళారాధనలో యింకా లీనమౌతాడు ? ... ఏం చేయాలి ? ... ఒక నిర్ణయానికొచ్చాను ... మగతగా నిద్రపట్టింది.

మర్నాడుదయం అతనితో కలిసి ఫలహారంచేసి, మళ్లీ సాయంత్రమే వస్తానని, గదిలోనే వుండమని, ఎక్కడికీ వెళ్లొద్దని మరీ మరీ చెప్పి మాట తీసుకుని వచ్చేశాను.

సాయంత్రం అయిదు గంటలకే ఉత్సాహంగా నిరంజనం గదిని చేరుకున్నాను. బలవంతంపెట్టి, అతన్ని, ఫిడేలు పెట్టితోసహా లాక్కుపోయాను; మా ప్రొడ్యూసర్‌గారింటికి. అక్కడ మా ప్రొడ్యూసరుగారినీ, డైరెక్టరుగారిని, సంగీత దర్శకుణ్ణి పరిచయం చేశాను. కొత్తగా, వింతగా చూశాడు నిరంజనం. అందరం కూర్చున్నాం. నిరంజనం మొహమాట పడుతున్నట్టుగా కనిపించాడు ధైర్యం చెప్పి తన కళా నైపుణ్యాన్ని ప్రదర్శించమన్నాను. డైరెక్టరుగారుకూడా హుషారిచ్చారు నిరంజనం కొద్దిసేపట్లోనే సర్దుకుని ఫిడేలుమీద తన నైపుణ్యాన్ని క్రమక్రమంగా ప్రదర్శించాడు. మా ప్రొడ్యూసరుగారు అతనివైపు తృప్తిగా చూడటం గమనించాను. మా సంగీత దర్శకులు సుబ్బారావుగారు తన కిష్టమైన రాగాల పేర్లు చెప్పి వాయించమన్నారు త్యాగరాజ కృతిని మళ్లీ వాయించమన్నారు. చాలా సేపు జరిగింది నిరంజనం ఫిడేలు కచేరీ.

బాగా పొద్దుపోయింతర్వాత, నిరంజనం గదికి చేరుకున్నాం. అలసటగా కుర్చీలో కూర్చుండిపోయాను. అతని మొహంలో ఒక రకమైన నిండుదనాన్ని చూడగలిగాను.

'నిరంజనంగారూ ! ఇక మనిద్దరి స్నేహం రోజు రోజుకీ అభివృద్ధి చెందుతుంది. ఇక మీరు నాతోనే వుంటారు" అన్నాను అతని కళ్లల్లోకి చూస్తూ.

'ఇప్పటికే మీరు నాకు మంచి స్నేహితులు. కానీ ఆనందరావుగారూ, నిజం చెప్పొద్దూ, అంత పెద్దవారి ఎదుట వాయించటానికి సిగ్గు వేసింది."


"నేను అనుకున్నదానికంటే ఎక్కువగానే వాళ్లందరూ మిమ్మల్ని మెచ్చుకున్నారు. ఇక అసలు విషయం చెప్పేస్తున్నాను. ఇకనుంచీ మీరుకూడా సినిమావాళ్లయిపోతున్నారు."

"అంటే...! ?" — ఆశ్చర్యంగా అడిగాడు నావైపు కొంచెం ముందుకి వంగి.

"మేం తీయబోయే సినిమాలో 'హీరో' వయొలిన్ వాయిస్తూంటాడు. నేపథ్యంలో మీరు వాయిస్తారన్నమాట. అదిగాక మా సుబ్బారావుగారు మిమ్మల్ని తమ 'ఆర్కెస్ట్రా'లో చేర్చుకుంటా నన్నారు." అన్నాను తాపీగా; అతని వదనంలో మెరవబోయే ఆనందాన్ని అంచనా వేస్తూ.

"వ్వాట్ !" కేక వేసినంత పని చేశాడు.

"అవును. మీలో గొప్ప సృజనాత్మక శక్తి వుందనీ, వయొలిన్ వాయించటంలో మీకు చాలా ప్రావీణ్యం వుందనీ, మిమ్మల్ని తన జట్టులోకి ఆనందంగా తీసుకుంటానని అన్నారు. గొప్ప సంగీత దర్శకుడాయన. ఒకంతట ఎప్పుడూ ఏ కళాకారుణ్ణీ మెచ్చుకోనివాడు. మిమ్మల్ని ఒకటే పొగుడుతున్నాడు. నిరంజనంగారూ ! ఒక మంచి కళాకారుణ్ణి కళాజగత్తుకి పరిచయం చేస్తున్నందుకు నాకు గర్వంగా వుంది" అన్నాను.



"మీరు నిజంవే చెబుతున్నారా ఆనందరావు గారూ !" ఇంకా నమ్మలేకపోతున్నాడు మానవుడు.

"అవును. ఇప్పుడు మీకు నెలకి ఆరువంద ...స్తారు. మీరు కృషి చేస్తే మిమ్మల్ని తప్పకుండా తనకి సహాయకుడిగా తీసుకుంటారు సుబ్బారావుగారు. నాకా నమ్మకం వుంది. ఈ కళా ప్రపంచంలో మీ పేరు మారుమోగుతుంది. మీరు కోరుకున్న జీవితం మీకు లభిస్తోంది... రేపు వుదయం పది గంటలకి వస్తాను. సుబ్బారావుగారి ఆఫీసుకి వెళ్దాం. అక్కడే అన్నీ మాట్లాడుకుందాం. మీరెప్పుడు చేరేదీ, మీరేం చెయ్యాలీ, అన్నీను. ముందు మీరీ మందుల బంధంనుండి బయటపడాలిగా" అన్నాను.

నిరంజనం ఏమీ చెప్పలేకపోయాడు. చెప్పలేదు. అతని భుజంమీద స్నేహపూర్వకంగా తట్టి, వుండి పొమ్మని బలవంతం చేస్తున్నా, అతని ఆలోచనలకి అంతరాయం వుండకూడదని, కావాలనే వచ్చేశాను.

మర్నాడుదయం పది గంటలకే వెళ్లాను. అతని గదికి తాళం వేసివుంది. కిందని వున్న 'లాడ్జింగ్ మేనేజరు' దగ్గరకి వెళ్లి వాకబు చేశాను. అతను, నేనే ఆనందరావునని తెలుసుకుని, నిరంజనం నా కిమ్మన్నాడని ఒక కవరిచ్చాడు. కవరు చించి వుత్తరాన్ని బయటికి తీసి చదువుకున్నాను.

ఆనందరావుగారూ !

నన్ను క్షమించండి.

నిన్న రాత్రంతా బాగా ఆలోచించాను. మీ మంచితనానికీ, స్నేహానికీ ముగ్ధుణ్ణవుతున్నాను. మీ రుణం నేను ఎప్పటికీ తీర్చుకోలేనేమో !

నాకు యిష్టంలేని జీవితం — నా వుద్యోగం. అందులోంచి పారిపోలేక, మానసిక విశ్రాంతికోసం సంగీతాన్ని ఆరాధించాను. ప్రతిఫలం ఆశించలేదు. కనుక ఆ విద్య నన్ను అంతగా ఆవహించిందేమో.

పూర్తిగా వ్యాపార దృక్పథం వున్న వృత్తి జీవితం నుండి అంత సులభంగా బయటపడలేనేమో ననిపిస్తోంది. నా కుటుంబ సభ్యులు కూడా అంగీకరించరు. ఇప్పుడున్న జీవితానికి సంఘంలో గౌరవం వుంది. మర్యాద వుంది. నా ఆధారంగా నా కుటుంబానికి ఒక మనుగడ వుంది. సాఫీగా సాగిపోతూవుంది. ఒక్కసారిగా నేను వాటన్నిటినించీ బయటపడగలనా ? నా భార్యా పిల్లలు హర్షిస్తారా?

పైగా యీ కళని వృత్తిగా స్వీకరిస్తే నేను విజయం సాధించలేననిపిస్తోంది. ఒక అందమైన అందని వస్తువుగానే అది నాకు నిత్యాకర్షణగా వుంటుందేమో ! అసలు యివేవీకాదు. ఇంకేదో కారణం, నాకే అస్పష్టంగా వుందది. ఇదంతా నిన్న రాత్రే నేను గ్రహించాను.

నాలోని యీ నైపుణ్యం, నా ఏకాంత జీవితంగానే వుండిపోనివ్వండి. అలవాటుపడిన దారిలోనే యీ బతుకుని సాగిపోనివ్వండి.

మా 'రిప్రజెంటేటివ్'ల 'మెస్'కి మారిపోతున్నాను.

ఇకనుంచీ నా కళతో నా చేతనయినంతవరకూ, నా చుట్టూ వున్నవారిని ఆనందింపజేయటానికి నిర్ణయించుకున్నాను. అలా ఒక సార్థకతని సాధిస్తాను.

మీ సహాయాన్ని అందుకోలేకపోతున్నందుకు నన్ను క్షమించండి.

నమస్కారం.
మీ
"నిరంజనం."

ఉత్తరాన్ని పూర్తిచేసి నవ్వుకున్నాను; నేను ఊహించినట్టే జరిగినందుకు. ఇక నిరంజనంలో అశాంతి, అసంతృప్తి వుండవు.

స్నేహ ధర్మాన్ని నిర్వర్తించినంత గర్వంగా హోటల్నుండి బయటపడ్డాను.

ఈ కథని తమ సునిశిత విమర్శతో, సూచనలతో సరిదిద్ది, కావలసిన సంగీత పరిజ్ఞానాన్ని ప్రసాదించిన వికాసం అధ్యక్షులు డా. వుప్పల లక్ష్మణరావుగారికి కృతజ్ఞతాభివందనాలు. —రచయిత



daCunha/CS/20 TL